సాక్షి ప్రకాశం
గురువారం । 28 । డిసెంబర్ । 2023



డబుల్ ఓట్లపై బహిరంగ చర్చకు సిద్ధం

డబుల్ ఓట్లు, దొంగ ఓట్లపై దమ్ముంటే బహిరంగ చర్చకు రావాలని ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ సవాల్ విసిరారు.

- 8లో..



ప్రియుడి మోజులో భర్తను కడతేర్చి..

ప్రియుడి కోసం కట్టుకున్న వాడినే కడతేర్చింది ఓ మహిళ. మృతుడిది కురిచేడు మండలం అలవలపాడు

- 8లో..

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
30/21

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. పొగమంచు ఎక్కువగా ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి.



హనుమంతునిపాడు పోలీస్‌స్టేషన్ రాష్ట్రంలోనే ఉత్తమ పోలీస్‌స్టేషన్‌గా డీజీపీ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న ఎస్పీ, హెచ్‌ఎంపాడు ఎస్సై, సిబ్బంది



డీజీపీ నుంచి అవార్డు తీసుకుంటూ కరచాలనం చేస్తున్న ఎస్పీ మలికాగర్గ్

శోధన..ఛేదన

కనీస క్లూ కూడా లభించని సంచలనాత్మక కేసులను 24 గంటలు గడవక ముందే ఛేదించారు..నేరాల నియంత్రణకు పక్కా ప్రణాళికతో ముందడుగు..గంజాయి.. మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై ఉక్కుపాదం..మరో వైపు యువతలో చైతన్యం తీసుకువచ్చేందుకు 'సంకల్పం' పేరుతో అవగాహనా కార్యక్రమాలు..రోడ్డు ప్రమాదాలపై ప్రత్యేక ఫోకస్.. రౌడీ షీటర్లపై నిఘా.. ఫలితంగా 2023లో జిల్లాలో రోడ్డు ప్రమాదాలు, దొంగతనాలు తగ్గుముఖం పట్టాయి. సమర్థవంతంగా ప్రజలకు సేవలందిస్తుండడంతో ప్రత్యేక అవార్డులు..రివార్డులు అందుకుని అందరితో భేష్ అనిపించుకున్నారు. 2023లో జిల్లాలో జరిగిన కార్యక్రమాలపై క్రైమ్ రౌండప్....

- సంచలనాత్మక కేసుల్లో వేగంగా దర్యాప్తు
- 24 గంటల్లోనే కేసులు కొలిక్కి
- తగ్గిన రోడ్డు ప్రమాదాలు, దొంగతనాలు
- జిల్లాలో 10,036 కేసులు నమోదు కాగా 8,960 పరిష్కరించిన అధికారులు
- డ్రంక్ అండ్ డ్రైవ్‌పై ప్రత్యేక దృష్టి
- పోలీసుల సంక్షేమానికి ప్రత్యేక గ్రీవెన్స్
- రోడ్డు భద్రతపై ప్రత్యేకంగా అవగాహన కార్యక్రమాలు
- గంజాయి అక్రమ రవాణాపై ఉక్కుపాదం
- జిల్లాలో నేరాలు అదుపునకు ప్రత్యేక చర్యలు చేపట్టిన ఎస్పీ మలికా గర్గ్

ఒంగోలు సబర్బన్:

జిల్లాలో గత ఏడాదితో పోలిస్తే పోలీస్‌శాఖ పనితీరు మెరుగ్గా ఉంది. దొంగతనాలు, దోపిడీలు, రోడ్డు ప్రమాదాల్లో తగ్గుదల స్పష్టంగా కనిపిస్తోంది. ఎస్పీ మలికాగర్గ్ సారథ్యంలో పోలీస్ అధికారులు, సిబ్బంది విధుల్లో మెరుగైన ఫలితాలు సాధిస్తూ ముందుకు సాగుతున్నారు. 2021 జూలై 15న ఎస్పీగా మలికాగర్గ్ జిల్లాలో బాధ్యతలు తీసుకున్నారు. నాటి నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆరు సార్లు జిల్లాకు వచ్చారు. రెండుసార్లు యర్రగొండపాలెం, ఒకసారి మార్కాపురం, ఒకసారి దర్శి, ఒకసారి కొండపి, రెండు సార్లు ఒంగోలు వచ్చారు. సీఎం బందోబస్తు కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించారన్న ప్రసంశలు అందుకున్నారు కూడా. ఇదిలా ఉంటే యువత మాదక ద్రవ్యాల ఊబిలో కూరుకుపోకుండా మాదకద్రవ్యాల వల్ల కలిగే నష్టాల గురించి విద్యార్థులకు వివరించి వారిలో చైతన్యం తీసుకువచ్చేందుకు రాష్ట్రంలోనే ప్రయోగాత్మకంగా 'సంకల్పం' అన్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. 'ఫైట్ ఎగనెస్ట్ డ్రగ్స్' నినాదంతో జిల్లాలోని 70 కళాశాలల్లో పోలీస్ అధికారులు అవగాహనా కార్యక్రమాలు నిర్వహించారు. నేరాలను అదుపులో ఉంచటంతో పాటు రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా ఉంచి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్న వారిని జిల్లా బహిష్కరణకు కూడా గురిచేశారు. కోర్టుల్లో కేసుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకొని 'గుడ్ ట్రయల్ మానిటరింగ్' చేపట్టి పోక్సో కేసుల్లో ఒక్కొక్కరికి 20 ఏళ్ల వరకు జైలు శిక్షలు పడేలా చర్యలు చేపట్టారు. ఈ విధంగా అన్ని విభాగాల్లో ఉత్తమ ఫలితాలు సాధించి రాష్ట్రంలోనే అత్యుత్తమ బహుమతులు, రివార్డులు జిల్లాకు వచ్చేలా సిబ్బంది పని తీరును మెరుగు పరిచారు. సంచలనాత్మక కేసులను సైతం గంటల వ్యవధిలో ఛేదించి అంతే స్థాయిలో సంచనాలు సృష్టించారు పోలీసులు. నకిలీ స్టాంపులు, నకిలీ డాక్యుమెంట్లు, నకిలీ సర్టిఫికెట్ల కుంభకోణాల కేసులను సైతం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సిట్ ద్వారా ముమ్మరంగా దర్యాప్తు చేసి పలువురిని అరెస్టులు కూడా చేశారు.



- 2023లో 10,036 కేసులు నమోదు కాగా వాటిలో 8,960 కేసులు పరిష్కరించారు. అంటే నమోదైన కేసుల్లో 89 శాతం పరిష్కరించినట్లయింది.
- జిల్లాలో 25 గ్రేవ్ పాపర్టీ కేసులు నమోదై రూ.2.57 కోట్ల ఆస్తి దొంగలపాలైంది. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు 21 కేసులను ఛేదించి రూ.1.94 కోట్లు సొత్తు రికవరీ చేశారు.
- గుడ్ ట్రయల్ మానిటరింగ్ ద్వారా శిక్షలు పడే విధంగా సిబ్బందికి ఆదేశాలు ఇచ్చారు. మొత్తం 821 కేసులను గుర్తించిన పోలీసులు వాటిలో 97 కేసుల్లో శిక్షలు పడేలా సాక్ష్యాలు సేకరించారు. ఆయా కేసుల్లో ఒక కేసులో మరణ శిక్షతో పాటు 18 కేసుల్లో జీవిత ఖైదు, 3 కేసుల్లో 10 నుంచి 20 ఏళ్ల జైలుశిక్షతో పాటు ఇతర కేసుల్లో కూడా శిక్షలు, అపరాధ రుసుం పడేలా చర్యలు చేపట్టారు.
- రౌడీ షీటర్ల విషయంలో కూడా ప్రత్యేక నిఘా ఉంచారు. 254 కేసుల్లో 380 మంది రౌడీషీటర్ల ప్రమేయం ఉందని నిర్ధారించారు. 26 కేసుల్లో 26 మంది రౌడీ షీటర్లకు శిక్షలు పడేలా చర్యలు తీసుకున్నారు. మరో 100 కేసుల్లో 174 మంది సస్పెక్ట్ షీటర్ల ప్రమేయాన్ని గుర్తించారు. వారిలో 28 మంది అనుమానితులకు 15 కేసుల్లో శిక్షలు పడ్డాయి. జిల్లాలోని 1014 మంది రౌడీ షీటర్లలో 876 మందిని బైండోవర్ చేశారు.
- రోడ్డు ప్రమాదాలు గత సంవత్సరంతో పోలిస్తే ఈ ఏడాది 13 శాతం తగ్గాయి. 2023లో 811 కేసులు నమోదు కాగా వాటిలో 354 తీవ్రమైనవి. ఆ ప్రమాదాల్లో 395 మంది మృత్యువాత పడ్డారు. 457 స్వల్ప ప్రమాద కేసుల్లో 994 మంది గాయపడ్డారు. నిరంతర భద్రతా కారణాల వల్ల 2022తో పోలిస్తే ప్రమాదాల సంఖ్య 13 శాతం మేర తగ్గాయి.
- డ్రంకన్ అండ్ డ్రైవ్ కేసులు 3998 నమోదు కాగా 3625 కేసుల్లో 110 మందికి జైలు శిక్ష విధించారు. మిగిలిన వారికి రూ.75.59 లక్షల జరిమానా వసూలు చేశారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న 20,841 మందిపై కేసులు నమోదు చేసి రూ.16.17 లక్షలు జరిమానా విధించారు.
- గంజాయి రవాణాపై ఉక్కుపాదం మోపిన పోలీసులు నాటు సారా నిషేధంపై కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. ఎన్‌డీపీఎస్ కేసుల్లో 33 నమోదు చేసి 148 మందిని అరెస్ట్ చేసి రూ.42.14 లక్షల విలువైన 526.86 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.
- పబ్లిక్ గ్రీవెన్స్‌తో పాటు పోలీస్ ప్రతి స్పందన కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహిస్తున్నారు. అదేవిధంగా పోలీస్ సిబ్బంది సంక్షేమం కోసం ఎస్పీ ప్రత్యేక చొరవ చూపుతున్నారు.

సంచలనాత్మక కేసులను వేగంగా ఛేదించి..



మార్గదర్శి మేనేజర్ భార్య బృందం దోచుకున్న సొత్తును స్వాధీనం చేసుకొని వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ

జిల్లా వ్యాప్తంగా సంచలనాత్మక కేసులను సైతం అత్యంత వేగంగా దర్యాప్తు చేశారు. ప్రధానంగా ఒంగోలు నగరంలోని బ్యూటీ పార్లర్‌లో చోరీ కేసును గంటల వ్యవధిలో ఛేదించారు. మేక్ ఓవర్ అంటూ వచ్చి మహిళా బ్యూటీషియన్ షేక్ రజియా ఇంట్లో చోరీ కేసులో ఒంగోలు తాలూకా పోలీసులు నలుగురు మహిళలను అరెస్టు చేశారు. సెప్టెంబర్ 6వ తేదీన ఇంట్లోకి చొరబడి దాదాపు రూ.15 లక్షలకు పైగా సొత్తు దోచుకున్నారు. స్వల్ప వ్యవధిలోనే కేసును ఛేదించిన చేసులో మార్గదర్శి మేనేజర్ భార్య కూడా ఉండటం అప్పట్లో సంచలనం రేపింది. ఆ కేసులో మార్గదర్శి మేనేజర్ భార్య ముంద్రు లక్ష్మీ నవతతో పాటు కరణం మోహన్ దీప్తి, అలహరి అపర్ణ, దాసరి భానులను పోలీసులు అరెస్టు చేశారు.

వెలిగండ్ల మండలం జిల్లెళ్లపాడు గ్రామానికి చెందిన వివాహిత దారుణ హత్యకేసు రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేకెత్తించింది. హతురాలు రాధను ఆమె భర్తే హత్య చేసి..స్నేహితుడిని ఇరికించాలన్న కుట్రను అత్యంత సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి కేసును ఛేదించారు. ఇలా పలు కేసులను వేగంగా దర్యాప్తు చేసి నిందితులను అరెస్టు చేశారు.



రాధ మృతదేహం(ఫైల్)

ఎస్పీకి డీజీపీ డిస్క్ అవార్డు

ఎస్పీ మలికగర్గ్‌కు 2022లో శాంతిభద్రతల పరిరక్షణ, కన్విక్షన్ బేస్డ్ పోలీసింగ్ తదితర విభాగాల్లో ప్రతిష్టాత్మక డీజీపీ డిస్క్ అవార్డు దక్కింది. ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు గాను ఈ అవార్డును డీజీపీ కేవీ.రాజేంద్రనాథ్‌రెడ్డి స్వయంగా ఎస్పీ మలికగర్గ్‌కు అందజేశారు. కీలక కేసుల్లో నిందితులకు 100 శాతం శిక్ష పడేలా చర్యలు తీసుకున్నందుకు గాను ఈ అవార్డు ఇచ్చారు. మద్దిపాడు పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న హెడ్ కానిస్టేబుల్ యం.కృష్ణమూర్తికి కూడా డీజీపీ కమెండేషన్ డిస్క్ కూడా డీజీపీ చేతుల మీదుగా అందజేశారు.

హెచ్‌ఎంపాడు పోలీస్‌స్టేషన్‌కు బెస్ట్ పీఎస్ అవార్డు

జిల్లాలోని హనుమంతునిపాడు పోలీస్‌స్టేషన్‌కు రాష్ట్రంలోనే ఉత్తమ పోలీస్‌స్టేషన్‌గా ఎంపిక చేశారు. కేంద్ర హోం శాఖ ఏటా దేశంలోని ప్రజలకు అత్యుత్తమ, మెరుగైన సేవలందించే పోలీస్‌స్టేషన్‌లకు వివిధ అంశాల్లో గుర్తించి అత్యుత్తమ పోలీస్‌స్టేషన్లుగా ప్రకటిస్తుంది. అందుకుగాను 2022 సంవత్సరానికి గాను జిల్లాలోని హెచ్‌ఎంపాడు పోలీస్‌స్టేషన్‌ను ఎంపిక చేసి అవార్డు ప్రకటించింది. ఆ సందర్భంగా డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి చేతుల మీదుగా ఎస్పీ మలికాగర్గ్‌తో పాటు ఎస్సై, సిబ్బంది అవార్డు అందుకున్నారు.



జూన్‌లో ఒంగోలు నగరం, సింగరాయకొండల్లోని పలు గృహాల్లో జరిగిన వరుస దొంగతనాలు పోలీసులకు సవాల్‌గా మారాయి. సీసీ కెమెరాల ద్వారా దొంగతనాలకు పాల్పడుతున్న వారిని గుర్తించారు. తమిళనాడు గుమ్మడిపూడి సమీపంలోని కరుడుగట్టిన నేరగాళ్లు ఉండే ప్రాంతానికి పోలీసులు వెళ్లి నిందితులను అదుపులోని తీసుకున్నారు. మారువేషాల్లో వెళ్లిన పోలీసులు ముఠాను అత్యంత చాకచక్యంగా పట్టుకున్నారు. దర్యాప్తులో వీరు నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో జరిగిన పలు దొంగతనాల్లో వీరి హస్తం ఉందని తెలిసింది. అలాగే తాళ్లూరులో రూ.46 లక్షల దొంగతనం కేసు, ఒంగోలు నగరంలోని రూ.12.35 లక్షల ఇంటి దొంగతనం కేసులను కూడా వేగంగానే కొలిక్కి తీసుకువచ్చారు.



పోలీసుల సంక్షేమ కమిటీ సమావేశం

న్యూస్‌రీల్

జాతీయస్థాయి పోటీలకు మైనంపాడు క్రీడాకారులు



జాతీయ స్థాయి హాకీకి ఎంపికైన క్రీడాకారులు

చీమకుర్తి: సంతనూతలపాడు మండలం మైనంపాడు ప్రభుత్వ హైస్కూలుకు చెందిన హాకీ క్రీడాకారులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ రవికుమార్ తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు వచ్చేనెల 1న మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లో జరిగే పోటీల్లో పాల్గొంటారన్నారు. ఎంపికైన క్రీడాకారులను గ్రామస్తులు, పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

నేడు, రేపు స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు

ఒంగోలు: 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి డిసెంబర్ నెల స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు ఈ నెల 28, 29 తేదీల్లో నిర్వహించనున్నట్లు సమగ్రశిక్ష అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ వీఎస్ సుబ్బారావు ఒక ప్రకటనలో తెలిపారు. 28వ తేదీ 50 శాతం మంది ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు, 29న మిగిలిన 50శాతం మంది ఉపాధ్యాయులు హాజరుకావాలన్నారు. ఉర్దూ కాంప్లెక్స్ ఉపాధ్యాయులు, సబ్జెక్టు ఉపాధ్యాయులు వారికి కేటాయించిన కాంప్లెక్స్‌ల్లో హాజరుకావాలని, మినహాయింపు లేదన్నారు. 28న తెలుగు, గణితం, బయాలజీ సబ్జెక్టు ఉపాధ్యాయులు, 29న ఇంగ్లిష్, హిందీ, పీఎస్, సోషల్ సబ్జెక్టులకు సంబంధించిన ఉపాధ్యాయులు కాంప్లెక్స్‌లకు హాజరుకావాలన్నారు. ఐఎఫ్‌పీ, స్మార్ట్ టీవీ, ఎల్‌సీడీ ప్రొజెక్టర్ వసతి సౌకర్యం ఉన్న రూంలో సమావేశాలు నిర్వహించాలని కాంప్లెక్స్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. ఉప విద్యాశాఖ అధికారులు, మండల విద్యాశాఖ అధికారులు, సమగ్రశిక్ష సెక్టోరల్ అధికారులు ఆయా సమావేశాలను పర్యవేక్షణ చేయాలని, వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు మినిట్స్ నమోదు, హాజరు వివరాలు, రిసోర్సు పర్సన్స్‌ను ముందుగా ఎంపిక చేసుకుని అజెండా ప్రకారం సెషన్లు నిర్వహించాలన్నారు.

30న బీసీల మరో స్వాతంత్ర్య పోరాట రథయాత్ర

- జాతీయ బీసీ సంక్షేమ సంఘ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బొట్ల సుబ్బారావు



యాత్ర కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న బొట్ల సుబ్బారావు తదితరులు

ఒంగోలు: బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య నిర్దేశించిన ప్రకారం రాష్ట్ర అధ్యక్షుడు లాకా వెంగళరావు, రాష్ట్ర కన్వీనర్ ఆవుల నరశింహారావు, నూకానమ్మ, వై.నాగేశ్వరరావులు చేపట్టిన బీసీల మరో స్వాతంత్ర్య పోరాట రథయాత్ర ఈ నెల 30న ఒంగోలుకు చేరుకుంటుందని జాతీయ బీసీ సంక్షేమ సంఘ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బొట్ల సుబ్బారావు తెలిపారు. స్థానిక రాంనగర్‌లోని బీసీ సంక్షేమ సంఘం జిల్లా కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఈ యాత్ర ఈనెల 7న శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో ప్రారంభమైందన్నారు. 30వ తేదీ ఒంగోలు బైపాస్ రోడ్డులోని మంగమ్మ కాలేజీ నుంచి చర్చిసెంటర్ మీదుగా సంఘమిత్ర హాస్పిటల్ వరకు యాత్ర కొనసాగుతుందన్నారు. బీసీలకు 90 అసెంబ్లీ, 13 పార్లమెంట్ స్థానాలను రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు కేటాయించాలని డిమాండ్ చేశారు. మహిళా రిజర్వేషన్‌లో బీసీలకు సబ్ కోటా కేటాయించాలని, కేంద్ర ప్రభుత్వం జనగణనలో కుల గణన చేపట్టాలన్నారు. బీసీలకు చట్ట సభలలో 50శాతం రిజర్వేషన్, బీసీ ఉద్యోగులకు పదోన్నతుల్లో రిజర్వేషన్ కల్పించాలన్నారు. 30న రథయాత్రలో బీసీ యువత, బీసీ మహిళలు, బీసీ రైతులు, కార్మికులు, బీసీ ఉద్యోగులు హాజరై జయప్రదం చేయాలని కోరారు. రాష్ట్ర కార్యదర్శి తిర్లిక వాసు, శ్రీను, ఫణిదపు సుధాకర్, శిరిమెళ్ల అనీల్, బొద్దు వేణు, బొబ్బాల భాను, రమణయ్య, వెంకయ్య, రవిప్రకాష్, పాలపర్తి సుబ్బారావు పాల్గొన్నారు.

మహిళలకు ఉచిత కంప్యూటర్ శిక్షణ

ఒంగోలు టౌన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు ఉచితంగా కంప్యూటర్ శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఆర్ లోకనాథం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండంలోని ఎండ్లూరు డొంక వద్ద ఉన్న మహిళా ప్రాంగణంలో శిక్షణ తరగతులు నిర్వహిస్తామని పేర్కొన్నారు. 15 నుంచి 45 ఏళ్ల లోపు వయసు కలిగిన మహిళలు దరఖాస్తు చేసుకోవాలన్నారు. జిల్లాలోని నిరుద్యోగ మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 9963005209 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

దర్యాప్తు వేగవంతం చేయాలి

- విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో కలెక్టర్ దినేష్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్, పక్కన ఏఎస్పీ నాగేశ్వరరావు

ఒంగోలు అర్బన్: ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద నమోదైన కేసుల్లో దర్యాప్తును మరింత వేగవంతం చేయాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ ఆదేశించారు. కలెక్టర్ అధ్యక్షతన ప్రకాశంభవనంలో బుధవారం జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. గత సమావేశంలో సభ్యులు ప్రస్తావించిన సమస్యలు, వాటిపై తీసుకున్న చర్యలపై కలెక్టర్ ఆరా తీశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ చట్టం స్ఫూర్తి దెబ్బతినకుండా వాస్తవ కేసుల్లో బాధితులందరికీ కచ్చితంగా సత్వర న్యాయం జరిగేలా చూడాల్సిన బాధ్యత అధికార యంత్రాంగంపై ఉందన్నారు. 2021, 2022, 2023 సంవత్సరాల్లో నమోదైన కేసులు, వాటి దర్యాప్తు తీరు, బాధితులకు అందిన పరిహారంపై కలెక్టర్ సమీక్షించారు. గత మూడేళ్లలో 341 కేసులు నమోదు కాగా వాటిలో 158 కేసులు పరిష్కరించామన్నారు. ఈ ఏడాది ఆగస్టు నుంచి నవంబర్ వరకు నాలుగు నెలల కాలంలో 244 మంది బాధితులకు రూ.1,74,50,000 పరిహారం అందించినట్లు తెలిపారు. కమిటీ సభ్యులు పి.లక్ష్మయ్య, బి.రమణమ్మ, జయరాజ్ మాట్లాడుతూ సింగరాయకొండలో ఎస్సీ, ఎస్టీ శ్మశాన స్థలాన్ని ఇతరులు కబ్జా చేస్తున్నారని, కొత్తపట్నం మండలంలో రికార్డుల ప్రకారం బాట లేకపోయినా ఈ సామాజిక వర్గాల వారి పొలాల్లో నుంచి అగ్రవర్ణాల వారు దౌర్జన్యంగా నడుస్తున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. దళిత, గిరిజనుల భూములు, శ్మశానాలు ఆక్రమణలకు గురికాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జరుగుమల్లిలోని కేజీబీవీలో వివిధ కార్యక్రమాల నిర్వహణ పేరుతో అందులో చదువుతున్న బాలికల నుంచి వార్డెన్, ప్రిన్సిపాల్ రూ.వెయ్యి చొప్పున వసూలు చేస్తున్నట్లు విద్యార్థులు వాపోతున్నారని సభ్యులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై విచారించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డీఈఓ సుబ్బారావును ఆదేశించారు. సమావేశంలో ఏఎస్పీ నాగేశ్వరరావు, డీఆర్ఓ శ్రీలత, మార్కాపురం సబ్ కలెక్టర్ రాహుల్ మీనా, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి లక్ష్మానాయక్, గిరిజన సంక్షేమ అధికారి జగన్నాథరావు, పంచాయతీరాజ్ ఎస్ఈ కొండయ్య, ఆర్అండ్‌బీ ఎస్ఈ దేవానందం, ఒంగోలు, కనిగిరి ఆర్డీఓలు విశ్వేశ్వరరావు, జాన్ ఇర్విన్, పోలీసు డీఎస్పీలు నారాయణస్వామిరెడ్డి, అశోక్‌వర్ధన్, వీరరాఘవరెడ్డి, రామరాజు, వి.శ్రీనివాసరావు తహశీల్దార్‌లు పాల్గొన్నారు.

అసత్య ప్రచారంపై చర్యలు తీసుకోండి

- ఆ పోస్టులతో తనకు ఎలాంటి సంబంధం లేదు
- ఒంగోలు డీఎస్పీకి ఫిర్యాదు చేసిన ఒంగోలు ఎంపీ మాగుంట

ఒంగోలు సబర్బన్: సోషల్ మీడియాలో తనపై అసత్య ప్రచారం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. తాను పార్టీ మారుతున్నట్లు వచ్చిన ప్రచారాన్ని ఆయన ఖండించారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒంగోలు డీఎస్పీ వి.నారాయణ స్వామిరెడ్డికి ఫిర్యాదు చేశారు. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్, ఎక్స్ వంటి సోషల్ మీడియా పేజీల్లో తనపై లేనిపోని ఆరోపణలు, అసత్య ప్రచారాలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఆ పోస్టులతో తనకు ఎలాంటి సంబంధం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. అసత్య ప్రచారం చేసిన వారిని సత్వరమే కనిపెట్టి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయమై మీరు తీసుకున్న చర్యలను తెలియజేయాలని ఎంపీ మాగుంట ఆ ఫిర్యాదులో స్పష్టం చేశారు.



ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డికి వ్యతిరేకంగా సోషల్ మీడియాలో వచ్చిన పోస్టు

వినియోగదారుల చట్టాలపై అవగాహన అవసరం



వినియోగదారుల దినోత్సవంలో మాట్లాడుతున్న జేసీ శ్రీనివాసులు

- జాతీయ వినియోగదారుల దినోత్సవంలో జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు

ఒంగోలు అర్బన్: వినియోగదారుల చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండి మోసపోకుండా తగిన జాగ్రత్తలు వహించాలని జాయింట్ కలెక్టర్ కె.శ్రీనివాసులు అన్నారు. స్పందన భవనంలో జిల్లా పౌరసరఫరాల అధికారి ఉదయభాస్కర్ అధ్యక్షతన బుధవారం జాతీయ వినియోగదారుల దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హజరైన జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ సంబంధిత శాఖలతో పాటు వినియోగదారుల సంఘాలు చట్టాలపై ప్రజలను చైతన్యపరచాలన్నారు. ముఖ్యంగా రైతులకు ఎరువులు, విత్తనాలు వంటి కొనుగోలుపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియచేయాలన్నారు. ప్రతి వస్తువు కొనుగోలు చేసే సమయంలో ప్రజలు చట్టబద్ధంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలన్నారు. సర్వీస్ సెక్టార్‌లో కూడా ఎటువంటి మోసాలు జరుగుతాయి, వాటి నుంచి ఎలా రక్షణ పొందాలనే అంశాలను విరివిగా ప్రచారం చేయాలన్నారు. వినియోగదారులు సంఘాల ప్రతినిధులు మాగులూరి నాగేశ్వరరావు ఆన్‌లైన్ విక్రయాలు, మోసాలపై వివరించగా వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాసరావు రైతులు విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఏవైనా మోసాలు జరిగితే తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా వినియోగదారుల కమిషనర్ అధ్యక్షురాలు శ్రీదేవి, సామీర, ఆర్టీసీ ఆర్ఎం, తూనికలు కొలతలు, ఆహార భద్రత, జిల్లా సివిల్ సప్లయి అధికారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా సంబంధిత శాఖలు తూనికలు, కొలతల్లో జరిగే మోసాలు, ఆహార పదార్థాల్లో కల్తీలపై ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను అతిథులు వీక్షించారు. అనంతరం పోటీల్లో విజేతలైన విద్యార్థులకు సర్టిఫికెట్‌లు, బహుమతులు ప్రదానం చేశారు.

వైద్య ఆరోగ్య శాఖలో ఉద్యోగాలకు నోటిఫికేషన్

ఒంగోలు టౌన్: జిల్లాలో వైద్య కళాశాలలు, వైద్యశాలలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ విడుదల చేశారు. డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్, కలెక్టర్ ఆదేశాల మేరకు కాంట్రాక్ట్ , ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో ఖాళీలను భర్తీ చేయనున్నట్లు జీఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏడుకొండలు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒంగోలు, మార్కాపురంలోని ప్రభుత్వ వైద్యశాలలు, సర్వజన ఆస్పత్రులు, ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో ఖాళీగా ఉన్న వివిధ ఉద్యోగాలకు అర్హత ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దరఖాస్తులను జిల్లా వెబ్‌సైట్‌లో పొందుపరిచామన్నారు. దరఖాస్తులను జనవరి 6వ తేదీ లోగా రిజిస్టర్ పోస్టు ద్వారా గానీ, వ్యక్తిగతంగా గానీ అందజేయాలన్నారు.

క్లుప్తంగా

చిన్నారి చికిత్సకు రూ.75 వేలు ఆర్థికసాయం


మహమ్మద్ తాతకు నగదు అందజేస్తున్న గీతం స్కూల్ ఉపాధ్యాయులు

సింగరాయకొండ: మండలంలోని సోమరాజుపల్లి పంచాయతీ టీపీ నగర్‌కు చెందిన మూడేళ్ల బాలుడు షేక్ మహమ్మద్ చికిత్సకు గీతం స్కూల్ కరస్పాండెంట్ లక్ష్మణరావు రూ.75 వేల ఆర్థికసాయం అందజేశారు. బాలుడు సాంబారు డేగిసాలో పడి ఒళ్లు కాలి విజయవాడలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయం విదితమే. బుధవారం నగదును గీతం స్కూలు ప్రిన్సిపాల్ తాజుద్దీన్ తోటి ఉపాధ్యాయులతో కలిసి మహమ్మద్ తాతకు అందజేశారు. పాఠశాల యాజమాన్యానికి బాలుడి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

భార్యపై కత్తితో దాడి


వైద్యశాలలో చికిత్స పొందుతున్న ఆయేషా

యర్రగొండపాలెం: కుటుంబ కలహాల నేపథ్యంలో భార్యపై భర్త కత్తితో దాడి చేసిన సంఘటన బుధవారం యర్రగొండపాలెంలో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. స్థానిక ఇందిరా నగర్‌లో నివాసం ఉంటున్న మస్తాన్, ఆయేషా భార్యాభర్తలు. వీరి మధ్య గత కొంతకాలంగా కలహాలు చోటుచేసుకుంటున్నాయి. గత అక్టోబర్ నెలలో భర్త వేధింపులకు గురిచేస్తున్నాడని ఆయేషా పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు మస్తాన్‌కు స్టేషన్ బెయిల్ ఇచ్చారు. ఈ విషయమై భార్యాభర్తల మధ్య రాజీ చేయడానికి వారి బంధువులు చర్చలు జరుపుతున్న సమయంలో మస్తాన్ కత్తి తీసుకుని ఆయేషా తలపై పొడిచాడు. దీంతో ఆమెకు తీవ్ర గాయమైంది. బంధువులు హుటాహుటిన స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎంపీ రాజేష్ తెలిపారు.

డబుల్ ఓట్లపై బహిరంగ చర్చకు సిద్ధం

- గుంటూరు, పీసీపల్లిలో ఓట్లు ఎవరెవరికి ఉన్నాయో తేలుద్దాం రండి
- టీడీపీ నేతలకు కనిగిరి ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ సవాల్
- పనిగట్టుకుని దుష్ప్రచారం చేయడంపై మండిపాటు


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్

కనిగిరి రూరల్: టీడీపీ నేతల తీరు చూస్తుంటే దొంగే.. దొంగా..దొంగా అన్న చందాన ఉందని, డబుల్ ఓట్లు, దొంగ ఓట్లు తొలగించాలని తానే అనేక సార్లు అధికారులకు విన్నవించానని, దమ్ముంటే బహిరంగ చర్చకు రావాలని ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ సవాల్ విసిరారు. బుధవారం ఆయన కనిగిరిలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. వైఎస్సార్ సీపీపై పనిగట్టుకుని దుష్ప్రచారం చేస్తే ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని తీవ్రంగా మండిపడ్డారు. ఓటమి భయంతోనే కనిగిరిలో దొంగ ఓట్లు ఉన్నాయని టీడీపీ శ్రేణులు, పచ్చమీడియా అసత్య ప్రచారం చేస్తున్నాయని దుయ్యబట్టారు. ఎన్నికల అధికారులు నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన సమావేశాల్లో దొంగ ఓట్లు, డబుల్ ఓట్లను తొలగించాలని కోరిన తనపై తప్పుడు ప్రచారం చేయడం సరికాదని హితవు పలికారు. పీసీపల్లి మండలం గుదేవారిపల్లికి చెందిన 270 మందికి గుంటూరులో ఓట్లున్నాయని నిరూపించేందుకు సిద్ధంగా ఉన్నాని, టీడీపీ నేతలకు దమ్ముంటే బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. ఓటమి భయంతో పీసీపల్లి, పామూరు మండలాల్లో బీఎల్వోలను బెదిరిస్తోంది మీరు కాదా అని తీవ్రంగా మండిపడ్డారు. కనిగిరిలో టీడీపీ నేతలు చేసిన దుర్మార్గాలు ప్రజలు ఇంకా మరువలేదని, ఎన్ని జిమ్మిక్కులు చేసినా ప్రజలు విశ్వసించరని చెప్పారు. కనిగిరి నియోజకవర్గ ప్రజలు ప్రశాంత పాలన కోరుకుంటున్నారని, భయంతో జీవించాలనుకోవడం లేదని స్పష్టం చేశారు. 14 ఏళ్ల టీడీపీ పాలనలో దోచుకోవడం దాచుకోవడం తప్పా ప్రజలకు చేసిందేమీ లేదని ఎద్దేవా చేశారు.

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందిస్తున్నామని ఎమ్మెల్యే బుర్రా పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయం తథ్యమన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ ఎస్కే అబ్దుల్ గఫార్, ఏఎంసీ చైర్మన్ సాల్మన్ రాజు, పార్టీ పట్టణ అధ్యక్షుడు రంగనాయకులరెడ్డి, వైస్ ఎంపీపీ పులి శాంతి గోవర్ధన్‌రెడ్డి, ఆర్.మాణిక్యరావు, పార్టీ రాష్ట్ర కార్యదర్శులు డాక్టర్ పెరుగు మురళీకృష్ణ, తమ్మినేని సుజాత, బసిరెడ్డి పిచ్చిరెడ్డి, ఎస్కే జిలాని, చింతం శ్రీను, ఎస్కే ఖాజా, లింకన్, పార్టీ మండల అధ్యక్షులు జీ బొర్రారెడ్డి, సతీష్ చౌదరి, భనవం కృష్ణారెడ్డి, ఎస్వీ గోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రియుడి మోజులో భర్తను కడతేర్చి..

- గుంటూరు నగరం లక్ష్మీనగర్‌లో ఘటన
- సుపారీ చెల్లింపుపై నిందితులు, కిరాయి హంతకుల మధ్య వివాదం
- హత్య విషయం ఆలస్యంగా వెలుగులోకి..
- మృతుడిది కురిచేడు మండలం అలవలపాడు


రామచంద్రయ్య మృతదేహానికి పోస్టుమార్టం చేస్తున్న వైద్యాధికారి ప్రమోద్‌కుమార్

కురిచేడు: ప్రియుడి కోసం కట్టుకున్న వాడినే కడతేర్చింది ఓ మహిళ. గుంటూరు నగరంపాలెం సీఐ కె.మల్లికార్జున కథనం మేరకు.. కురిచేడు మండలంలోని అలవలపాడు గ్రామానికి చెందిన చిన్నకత్తి రామచంద్రయ్య(40) గుంటూరులోని లక్ష్మీనగర్‌లో భార్యాబిడ్డలతో నివాసముంటూ కూలీనాలి చేసుకుని కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. రామచంద్రయ్య భార్య వెంకటరమణ గుంటూరుకు చెందిన చిన్నా అనే వ్యక్తితో వివాహేతర సంబంధం కొనసాగిస్తోంది. అయితే తమ సంబంధానికి భర్త రామచంద్రయ్య అడ్డుగా ఉన్నాడని అంతమొందించాలని పథకం పన్నారు. ఇందుకు చిన్నా.. ఇద్దరు కిరాయి హంతకులతో రూ.లక్షకు సుపారీ కుదర్చుకున్నాడు. గత నెల 27వ తేదీ రాత్రి రామచంద్రయ్య పనులకు వెళ్లి నిద్రిస్తున్న సమయంలో వెంకటరమణ, చిన్నా, కిరాయి గూండాలు శ్యామ్, చిన్ను కలిసి కండువాను రామచంద్రయ్య గొంతుకు బిగించి హత్య చేశారు. రామచంద్రయ్య మెడలో ఉన్న బంగారు చైన్‌ను తాకట్టు పెట్టి సుపారీ కింద రూ.60 వేలు ఇచ్చారు. ఆ తరువాత మృతదేహాన్ని అలవలపాడు తీసుకొచ్చి ఆత్మహత్య చేసుకున్నాడని నమ్మించి అంత్యక్రియలు పూర్తిచేశారు. అయితే సుపారీ ఒప్పందం ప్రకారం మిగిలిన నగదు ఇవ్వాలని శ్యామ్, చిన్నూ అడగడంతో వారి మధ్య వివాదం మొదలైంది. హత్య విషయం బయటకు పొక్కటంతో గుంటూరు నగరంపాలెం సీఐ కె. మల్లికార్జున సుమోటోగా కేసు నమోదు చేసి నలుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. తమదైన శైలిలో విచారించడంతో రామచంద్రయ్యను హత్య చేసినట్లు ఒప్పుకున్నారు. గుంటూరు నగరంపాలెం ఎస్సై బి.రవీంద్రనాయక్, గుంటూరు గవర్నమెంట్ మెడికల్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ ప్రమోద్‌కుమార్, రుద్ర చారిటబుల్ ట్రస్టు సభ్యులు బుధవారం అలవలపాడు చేరుకున్నారు. తహసీల్దార్ ఎం.జ్వాలా నరసింహం, వీఆర్వో కాశయ్య, గ్రామ పెద్దల సమక్షంలో రామచంద్రయ్య మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిర్వహించారు.

ఆటో బోల్తా.. యువకుడి మృతి


భాస్కర్‌కు చికిత్స చేస్తున్న వైద్యులు

పెద్దదోర్నాల: వేగంగా వెళ్తున్న ఆటో బోల్తా పడటంతో యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన పెద్దదోర్నాలలోని హరివిల్లు హోటల్ సమీపంలో కర్నూలు–గుంటూరు హైవేపై మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్సై అంకమరావు కథనం మేరకు.. చిన్నగుడిపాడుకు చెందిన కాకర్ల భాస్కర్ వ్యక్తిగత పని మీద మంగళవారం తన నలుగురు స్నేహితులతో కలిసి ఆటోలో పెద్దదోర్నాల వచ్చాడు. రాత్రి వేళ స్వగ్రామానికి వెళ్తున్న సమయంలో హరివిల్లు హోటల్ సమీపంలో ఆటో బోల్తా పడింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన భాస్కర్‌ను హుటాహుటిన స్థానిక పీహెచ్‌సీకి తరలించి ప్రథమ చికిత్స చేశారు. మెరుగైన వైద్యం కోసం మార్కాపురం జిల్లా వైద్యశాలకు తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు ఒంగోలు తీసుకెళ్తుండగా పరిస్థితి విషమించి మార్గమధ్యంలో మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

క్షణికావేశంలో యువకుడు ఆత్మహత్య


హరీష్(ఫైల్)


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై ఖాదర్‌బాషా

టంగుటూరు: కుటుంబ సభ్యులతో గొడవపడిన ఓ యువకుడు క్షణికావేశంలో చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన టంగుటూరు మండలంలోని ఎం.నిడమానూరులో మంగళవారం రాత్రి చోటుచేసుకోగా బుధవారం ఆలస్యంగా వెలుగుచూసింది. మృతదేహాన్ని గ్రామస్తులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసుల కథనం మేరకు.. కొండపి గ్రామానికి చెందిన లక్కి హరీష్(26) బొంతలు కుట్టుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. ఇతనికి రెండు నెలల క్రితం మూడో వివాహమైంది. మంగళవారం రాత్రి కుటుంబ సభ్యులతో వివాదం తలెత్తడంతో ఆవేశంగా బయటకువచ్చాడు. ఎం.నిడమానూరు–మర్లపాడు గ్రామాల మధ్య ఉన్న చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. చెరువు వద్ద ద్విచక్ర వాహనాన్ని గమనించిన గ్రామస్తులు అనుమానంతో చుట్టుపక్కల పరిశీలించగా మృతదేహం కనిపించింది. పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్సై ఖాదర్‌బాషా సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. గ్రామస్తుల సహకారంతో మృతదేహాన్ని బయటకు తీశారు.

అనంతరం కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పల్లెపాలెం తీరంలో యువకుడు గల్లంతు


ప్రవీణ్(ఫైల్)


సముద్ర తీరానికి కొట్టుకొచ్చిన ప్రవీణ్ మృతదేహం

కొత్తపట్నం: సముద్ర స్నానం చేస్తుండగా అలల ఉధృతికి గల్లంతైన యువకుడు శవమై తేలాడు. పోలీసులు తెలిపిన వివరాలు మేరకు.. పామూరు మండలం నుచ్చుపొద గ్రామానికి చెందిన కేసనపల్లి ప్రవీణ్(20) ఆటో డ్రైవర్‌గా పనిచేస్తుంటాడు. అదే గ్రామానికి చెందిన పది మంది ప్రవీణ్ ఆటోను బాడుగకు తీసుకుని సముద్ర స్నానం నిమిత్తం కొత్తపట్నం బీచ్‌కు మంగళవారం సాయంత్రం వచ్చారు. సముద్రం ఒడ్డున కాసేపు సెల్ఫీలు తీసుకున్నారు. అనంతరం స్నానం చేయడానికి పది మంది నీటిలోకి దిగారు. ఈ క్రమంలో అలల ధాటికి దోకిపాటి అమృత, కేసనపల్లి ప్రవీణ్, డి.రాము కొట్టుకుపోతున్నారు. ఇది గమనించిన వారు పెద్దపెట్టున కేకలు వేయడంతో మెరైన్ పోలీసులు హుటాహుటిన చేరుకుని అతి కష్టం మీద దొకిపాటి అమృత, డి.రామును రక్షించారు. ప్రవీణ్ మాత్రం అలల ఉధృతికి కొట్టుకుపోయాడు. అతడిని రక్షించేందుకు మెరైన్ పోలీసులు తీవ్రంగా ప్రయత్నించినా ఫలించలేదు. బుధవారం మధ్యాహ్నం వజ్జిరెడ్డిపాలెం సముద్ర తీరానికి ప్రవీణ్ మృతదేహం కొట్టుకొచ్చింది. ఎస్సై బి.సాంబశివరావు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నిజాలు దాచి ఈనాడు వక్ర రాతలు

- ఘడియాపూడి, మద్దిపాడు గ్రామాల యువత గ్రౌండ్‌లోనే ఆడిన వైనం


మద్దిపాడు కడియాల యానాదయ్య హైస్కూల్ గ్రౌండ్‌లో షటిల్ బ్యాడ్మింటన్ ఆడుతున్న యువకులు

మద్దిపాడు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంపై పచ్చ పత్రిక ఈనాడు విషం చిమ్ముతూనే ఉంది. మండల కేంద్రంలో కేవైజీహెచ్ స్కూలు మైదానం మొత్తం బురదమయం అయిందంటూ మంగళవారం తప్పుడు కథనాన్ని ప్రచురించింది. దానిని సమర్థించుకునే విధంగా బుధవారం సైతం మరోమారు తప్పుడు వార్తను వండివార్చింది.

ఈ గ్రౌండ్‌లోనే మద్దిపాడు, ఘడియపూడి రెండు సచివాలయాలకు చెందిన యువత కబడ్డీ వాలీబాల్, ఖోఖో, షటిల్ బ్యాడ్మింటన్ ఆటలు ఆడుతున్నట్లు అధికారులు ప్రకటించారు. ఆ మేరకు పోటీలు కూడా నిర్వహించారు. దానిని పట్టించుకోని ఆ పత్రిక బురద ఉన్న ప్రాంతంవైపు ఎవరూ రాకుండా ఏర్పాటు చేసిన తాడునే బూచిలా చూపింది. విశాలమైన గ్రౌండ్‌లో ఉత్సాహంగా సాగుతున్న క్రీడా పోటీలను ఉద్దేశపూర్వకంగా మరుగునపెట్టి నైజం చాటుకుంది.

జనవరి 22న ఓటరు జాబితా విడుదల

- ఒంగోలు ఆర్డీఓ విశ్వేశ్వరరావు వెల్లడి


రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న ఆర్డీఓ విశ్వేశ్వరరావు

ఒంగోలు అర్బన్: ఓటరు జాబితా విడుదల తేదీని జనవరి 5 నుంచి 22వ తేదీకి ఎన్నికల కమిషన్ మార్పు చేసినట్లు ఒంగోలు ఆర్డీఓ విశ్వేశ్వరరావు తెలిపారు. బుధవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఆర్డీఓ మాట్లాడుతూ.. పెండింగ్ దరఖాస్తుల పరిశీలన గడువును ఎన్నికల సంఘం జనవరి 12వ తేదీకి పొడిగించిందని, ఈ నేపథ్యంలోనే ఓటరు జాబితా విడుదల తేదీని జనవరి 5 నుంచి 22కు మార్చిందని వివరించారు. రానున్న సాధారణ ఎన్నికల నేపథ్యంలో రెవెన్యూ డివిజన్‌లో చెక్‌పోస్టుల ఏర్పాటు, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల గుర్తింపు ప్రక్రియ చురుగ్గా సాగుతోందని చెప్పారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు పొందేలా రాజకీయ పార్టీలు కృషి చేయాలని కోరారు. సమావేశంలో ఒంగోలు తహసీల్దార్ మురళి, వైఎస్సార్ సీపీ ప్రతినిధి దామరాజు క్రాంతికుమార్, ఇతర పార్టీల ప్రతినిధులు రాజశేఖర్, సత్యం, రసూల్, రమేష్, శ్రీదేవి, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

ఆహా క్యాంటీన్లపై అసత్య ప్రచారం తగదు

- డీఆర్‌డీఏ పీడీ తేళ్ల రవికుమార్
- త్వరలో 4 పట్టణ మహిళా ప్రగతి యూనిట్లు ప్రారంభించనున్నట్లు వెల్లడి

కనిగిరి రూరల్: జిల్లాలోని నాలుగు ప్రాంతాల్లో పట్టణ మహిళా ప్రగతి యూనిట్లను త్వరలోనే ప్రారంభించనున్నట్లు డీఆర్‌డీఏ పీడీ తేళ్ల రవికుమార్ వెల్లడించారు. బుధవారం ఆయన కనిగిరిలో విలేకర్లతో మాట్లాడారు. కనిగిరి, మార్కాపురం, చీమకుర్తి, ఒంగోలులో ఎస్‌హెచ్‌సీ గ్రూపుల సభ్యులతో మెప్మా ఆర్థిక సాయంతో ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. అలాగే ప్రతి పట్టణంలో మెప్మా ఆధ్వర్యంలో అర్బన్ మార్కెట్ సెంటర్లను ప్రతి నెలలో రెండు రోజులు ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. ఆహా క్యాంటీన్లలో రోజూ సుమారు 400 మందికి రూ.30కే ఆహారం అందజేస్తున్నట్లు తెలిపారు. ఒంగోలులో 3, గిద్దలూరులో 1 ఆహా క్యాంటిన్లు నడుస్తున్నాయని, కనిగిరి, మార్కాపురం, చీమకుర్తిలో వసతి, అసౌకర్యాల కారణంగా తాత్కాలికంగా ఆగినట్లు చెప్పారు. త్వరలోనే వాటిని పునఃప్రారంభిస్తామని స్పష్టం చేశారు. ఆహా క్యాంటీన్లలో రుచికరమైన, నాణ్యమైన భోజనాన్ని తక్కువ ధరకు ఎస్‌హెచ్‌జీ సభ్యుల ద్వారా అందజేస్తున్నట్లు వివరించారు. ఆహా క్యాంటీన్లపై దుష్ప్రచారం చేయడం సరికాదని హితవు పలికారు.

5 నుంచి తెలుగు మహాసభలు

ఇంకొల్లు(చినగంజాం): ఆంధ్ర సారస్వత పరిషత్, చైతన్య విద్యాసంస్థల సంయుక్త ఆధ్వర్యంలో 2024 జనవరి 5,6,7 తేదీల్లో రాజమహేంద్ర వరంలో నిర్వహించే 2వ అంతర్జాతీయ తెలుగు మహాసభల వాల్ పోస్టర్ ఆవిష్కరణ బుధవారం ఇడుపులపాడులో నిర్వహించారు. వాల్‌పోస్టర్‌ను మడగాస్కర్ దేశంలో భారత రాయబారి బండారు విల్సన్ బాబు, కస్టమ్స్ అండ్ సెంట్రల్ ఎక్సైజ్ జాయింట్ కమిషనర్ బండారు రత్నకిషోర్‌లు ఆవిష్కరించారు. ఆంధ్ర సారస్వత పరిషత్ బాపట్ల జిల్లా సంచాలకులు పిడవర్తి పేరిరెడ్డి మాట్లాడుతూ తెలుగు బాషా వైభవాన్ని తెలుగు జాతి సంస్కృతి సంప్రదాయాన్ని ప్రపంచానికి చాటే విధంగా మూడురోజులపాటు జమహాసభలు జరుగుతాయన్నారు. గజల్ గాయకులు గజల్ శ్రీనివాస్ నిర్వాహణలో ఆంధ్ర సారస్వత పరిషత్ ముఖ్య సంచాలకులు కేసీ రాజు రామప్రసాద్ పర్యవేక్షణలో వివిధ సాహితీ ప్రక్రియలపై సదస్సులు, కవిసమ్మేళనం, కథా పఠనం, సాంస్కృతిక కార్యక్రమాలు, కళారూపాలు వంటి అనేక కార్యక్రమాలు ఉంటాయని అన్నారు. సుమారు 70 దేశాల నుంచి ప్రతినిధులు, లక్ష మంది సాహితీ ప్రియులు పాల్గొంటారని, నాలుగు రాష్ట్రాల గవర్నర్‌లను, రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులను, మంత్రులను, పీఠాధిపతులను, సాహితీ వేత్తలను ఆహ్వానించామని తెలిపారు. అంబటి సురేష్ కంభాలపాటి నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

క్రీడా సమరం

ఆడుదాం.. ఆంధ్రా క్రీడా పోటీలు రెండో రోజు బుధవారం హోరాహోరీగా సాగాయి. జిల్లాలోని అన్ని గ్రామాల్లో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొని ప్రతిభ చాటారు. ప్రజాప్రతినిధులు, అధికారులు పోటీలను పర్యవేక్షించారు.


తర్లుపాడులో వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి


బేస్తవారిపేటలో వాలీబాల్ ఆడుతున్న బాలికలు


కనిగిరిలో సరదాగా కబడ్డీ ఆడుతున్న ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్


కొండపి హైస్కూల్లో వాలీబాల్ ఆడుతున్న బాలురు


గొట్లగట్టులో కబడ్డీ ఆడుతున్న బాలికలు


ఒంగోలులో క్రికెట్ ఆడుతున్న యువకులు